క్లుప్తంగా

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముస్తఫా



పట్నంబజారు: విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అష్టోతర శతకుండాత్మక, చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సమేత శ్రీలక్ష్మీ మహాయజ్ఞంలో శనివారం తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పూజల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ డెప్యూటీ కమిషనర్ ఈమని చంద్రశేఖర్‌రెడ్డి, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి లక్ష ఆకు పూజ



నగరంపాలెం: నాజ్ కూడలిలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో శనివారం పంచామృత స్నపన, లక్ష ఆకు పూజ నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం భాజాభజంత్రీలు, ధూప దీపాలతో, బాణసంచాలతో సందడి చేశారు. కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కళాకారుల వేషధారణలతో స్వామి గ్రామోత్సవం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఈవో డి.శ్రీనివాసరావు, దేవస్థానం చైర్మన్ పి.జయప్రకాష్‌రెడ్డి, శ్రీ హనుమాన్ దీక్ష సమాజం అధ్యక్షుడు వెంకటసుబ్బా రావు, ఆలయ అర్చకుడు నరసింహాచార్యులు, ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకటజ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి, సమాజం సభ్యులు అనీల్ కుమార్, నాగేశ్వరరావు, వెంకటరమణ, సీహెచ్.రమేష్, ప్రసాద్, పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృ దినోత్సవం

నగరంపాలెం: బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలోని అన్నమయ్య కళా వేదికపై గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. మాతృమూర్తి విశిష్టతను విశ్రాంత ఆచార్యులు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, తెలుగు రీడర్లు తోటకూర వెంకటనారాయణ, డాక్టర్ సుంకర గోపాలప్ప వివరించారు. విద్యార్థిని మారాజు తన్వీ కూచిపూడి నృత్యం సభికుల్ని అలరించింది. కార్యక్రమంలో డాక్టర్ చిట్టినేని శివకోటేశ్వరరావు, సంస్థ కన్వీనర్ గుళ్లపల్లి రాఘవేంద్రరావు, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య పాల్గొన్నారు.

బాత్‌రూంలో యువకుడి మృతదేహం

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): బాత్‌రూంలో ఒక యువకుడి మృతదేహం బయటపడింది. ఇంట్లో నుంచి తీవ్రంగా దుర్వాసన వస్తుండడంతో యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా విషయం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరుకు చెందిన మట్లపూడి దుర్గాప్రసాద్ (30) ఎంవీపీ కాలనీ సెక్టార్-12లోని ఓ అద్దె ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. అతను ఓ షోరూంలో సేల్స్‌మేన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. గత కొన్ని రోజులుగా ఇంట్లో నుంచి రాకపోకలు లేవు. ఇంటి యజమాని కూడా పట్టించుకోలేదు. రెండు రోజులుగా దుర్వాసన వస్తుండటంతో ఇంటికి వెళ్లి చూడగా లోపలి నుంచి గడపెట్టి ఉంది. దీంతో ఆ యజమాని ఎంవీపీ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు తలుపులు విరగ్గొట్టి లోపలికి వెళ్లి చూడగా దుర్గాప్రసాద్ మృతదేహం బాత్‌రూంలో కనిపించింది. కాలిజారి పడటం వల్ల తలకు గాయమై చనిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు సీఐ మల్లేశ్వరరావు వెల్లడించారు.

పది విద్యార్థులకు పునశ్చరణ

- ఫెయిల్ అయిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులతో పాఠ్యాంశాల బోధన
- ఉత్తీర్ణులయ్యేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్లో ప్రత్యేక పునశ్చరణ తరగతులను పర్యవేక్షిస్తున్న హెచ్ఎం రమాదేవి

ప్రత్తిపాడు: పదో తరగతి విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఇటీవల విడుదలైన 'పది' ఫలితాల్లో ఫెయిల్ అయిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా సబ్జెక్టుల వారీగా షెడ్యూల్‌ను నిర్ణయించి, స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తోంది.

ఉత్తీర్ణతే లక్ష్యంగా జూన్ 1 వరకు..

పదిలో అనుత్తీర్ణులైన విద్యార్థులతో ఉదయం 9 నుండి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 1.30 నుండి 4.30 గంటల వరకు రోజుకు రెండు సబ్జెక్టుల చొప్పున పునశ్చరణ చేయిస్తున్నారు. సంబంధిత సబ్జెక్టుల ఉపాధ్యాయులు సెలవుల్లోనూ పాఠశాలలకు హాజరై విద్యార్థులకు పాఠ్యాంశాలు మరింత మెరుగ్గా బోధించేలా విద్యాశాఖ చర్యలు తీసుకుంది. సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా, పాఠ్యాంశాల వారీగా పటిష్టమైన పునశ్చరణతో పాటు బోధనకు జూన్ ఒకటో తేదీ వరకు ప్రత్యేక తరగతులు జరగనున్నాయి. ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా పాఠశాలల హెచ్ఎంలు పర్యవేక్షిస్తున్నారు.

నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల వివరాలు మండలాల వారీగా ఇలా..

మండలం	పరీక్షలకు హాజరైన వారు	ఫెయిల్ అయిన వారు
ప్రత్తిపాడు	469	172
వట్టిచెరుకూరు	361	85
కాకుమాను	284	95
పెదనందిపాడు	205	61
గుంటూరురూరల్	2883	1024
మొత్తం	4,202	1,437

షెడ్యూల్ ఇలా..

ఉదయం (9-12.30)	మధ్యాహ్నం (1.30-4.30)
సోమవారం - తెలుగు	గణితం
మంగళవారం- సోషల్ స్టడీస్	ఫిజికల్ సైన్స్
బుధవారం - గణితం	బయలాజికల్ సైన్స్
గురువారం - ఫిజికల్ సైన్స్	సోషల్ స్టడీస్
శుక్రవారం - బయలాజికల్ సైన్స్	గణితం
శనివారం - సోషల్ స్టడీస్	తెలుగు



విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న సైన్స్ ఉపాధ్యాయురాలు

ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత లక్ష్యం



పదిలో ఫెయిల్ అయిన విద్యార్థులపై విద్యాశాఖ స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఫెయిల్ అయిన ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణత సాధించడమే టార్గెట్‌గా ప్రతేక పునశ్చరణ తరగతులు నిర్వహిస్తోంది. సబ్జెక్టుల ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పాఠ్యాంశాలు బోధిస్తున్నారు.

– సీహెచ్. రమాదేవి (ఎంఈవో, ప్రత్తిపాడు)

పదిలో ఫలితాల పైనే విద్యార్థుల భవిష్యత్



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం జోష్ మేరి, ఉపాధ్యాయులు

కాకుమాను: పదో తరగతి ఫలితాల పైనే విద్యార్థుల భవిష్యత్ అధారపడి ఉందని హెచ్ఎం టి.జోష్ మేరి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పది పరీక్షల్లో ఐదు వందలకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు శనివారం సన్మాన, అభినందన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థి దశలో పదవ తరగతి కీలకమైనదని, పరీక్షల్లో విద్యార్థులు కష్టపడి చదివితేనే భవిష్యత్ బంగారు బాట అవుతుందని తెలిపారు.ఈ ఏడాది అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థుల్ని ఆదర్శంగా తీసుకుని వచ్చే ఏడాది పరీక్షలకు సిద్ధమవుతున్న వారు రాణించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.వెంకటేశ్వర్లు, రవికుమార్, రాము, జి.మోహనరావు, జవహర్‌రాణి, అన్న పూర్ణయ్య, సుబ్బారావు, ప్రకాశరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ బహూకరణ



సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుచరిత

ప్రత్తిపాడు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ దివ్యాంగుడు విన్నవించుకున్న సమస్యకు స్థానిక ఎమ్మెల్యే పరిష్కారం చూపారు. మండల పరిధిలోని కొండేపాడులో కొద్దిరోజుల కిందట ఎమ్మెల్యే సుచరిత గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లిన సందర్భంలో గ్రామానికి చెందిన దివ్యాంగుడు వలివేరు మరియదాసు ట్రై సైకిల్ లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాననీ, ఇప్పించాలని సుచరితకు విన్నవించారు. స్పందించిన ఆమె శనివారం గుంటూరులోని తన కార్యాలయంలో మరియదాసుకు ట్రైసైకిల్‌ను అందించారు. దీంతో మరియదాసు సుచరితకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జొన్న పంట కొనుగోలు వేగవంతం చేయండి

తెనాలి ఇంచార్జి సబ్ కలెక్టర్ శివన్నారాయణశర్మ



వడ్లమూడిలో తడిసిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న శివన్నారాయణశర్మ తదితరులు

చేబ్రోలు: కొనుగోలు కేంద్రాల ద్వారా మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని తెనాలి ఇంచార్జి సబ్ కలెక్టర్ శివన్నారాయణశర్మ సిబ్బందిని ఆదేశించారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలో శనివారం ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, జొన్న పంటల్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 33 శాతం కన్నా ఎక్కువ దెబ్బతిన్న పంటల జాబితా, వర్షాలకు పంట దెబ్బతిన్న రైతుల జాబితాను వెంటనే అందజేయాలని వ్యవసాయశాఖ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక ఏవో బి. శ్రీనివాసనాయక్, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా చర్చి ప్రతిష్ట

తిక్కిరెడ్డిపాలెం (ప్రత్తిపాడు): క్రీస్తు మార్గం అనుసరణీయమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత తెలిపారు. మండలంలోని తిక్కిరెడ్డిపాలెం ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన పరిశుద్ధ పౌలు లూథరన్ దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ముఖ్య అతిథిగా సుచరిత పాల్గొన్నారు. పాస్టర్లు ప్రార్థనలు చేసి ఆమెకు ఆశీస్సులు అందించారు. సుచరిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమన్నారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సంఘ కాపరి రెవరెండ్ వి. కాంతారావు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

సంరక్షణ కేంద్రంలో గోవులకు సకల సదుపాయాలు



వెంగళాయపాలెం గో సంరక్షణ కేంద్రంలో పర్యటిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వెంగళాయపాలెంలోని సంరక్షణ కేంద్రంలో గోవులకు సకల సదుపాయాల్ని కల్పించినట్లు మేయర్ కావటి శివ నాగమనోహర్ నాయుడు తెలిపారు. గో సంరక్షణ సేవా దళ్ సమితి సభ్యులతో కలసి శనివారం కేంద్రాన్ని పరిశీలించారు. ఆవుల సంఖ్య, సంరక్షణ, సిబ్బంది గురించి అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. ఆవులకు సకాలంలో ఆహారం, నీరు అందించాలని సిబ్బందికి చెప్పారు. కేంద్రంలో తాగునీటి సౌకర్యం, మేత వేయడానికి తొట్టెలు, వర్షాలకు తడవకుండా మరో పాకతో పాటు లైట్లు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. వారానికి రెండు రోజులు పశు వైద్యులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి, గో సంరక్షణ సేవా దళ్ సమితి సభ్యులు భజరంగ్ రామకృష్ణ, పెద్దింటి కృష్ణ చైతన్య, ప్రదీప్ కుమార్ జైన్, సురేష్ కుమార్ జైన్, నిఖిల్ జైన్, రాజు పూర్వాల్, దినేష్ సాంఘి, వీరయ్య చౌదరి, నరసింహమూర్తి, అంకాల శ్రీనివాస్, వంగ నవీన్‌రెడ్డి డీఈఈ రమేష్, ఏఈ నాగవేణి, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నులకపేటలో పేకాటాడుతున్న ఆరుగురిని శనివారం తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు.. నులకపేట మసీదు రోడ్డు చివర ముళ్లపొదల్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాటాడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసినట్లు చెప్పారు. ఆరుగురు ఆటో డ్రైవర్లు పేకాట ఆడుతూ కనిపించారని, వీరి నుంచి రూ.3500 స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరుపరిచినట్లు చెప్పారు.

సీబీఎస్ఈ టెన్త్ విద్యార్థులకు జేసీ అభినందన



విద్యార్థులతో జేసీ రాజకుమారి, ఏజీఎం అంజయ్య, ప్రిన్సిపాల్ నర్మద

గుంటూరు ఎడ్యుకేషన్: సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చూపిన శ్రీచైతన్య స్కూల్ విద్యార్థుల్ని జాయింట్ కలెక్టర్ జి. రాజకుమారి అభినందించారు. నవభారత్‌నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య మాట్లాడుతూ శుక్రవారం ప్రకటించిన ఫలితాల్లో పైలా శ్రీదీప్ 500 మార్కులకు 486, చిన్నం శ్రీహర్ష 485, నూతలపాటి నిహార్ 483 మార్కులు సాధించారని తెలిపారు. పరీక్షలు రాసిన విద్యార్థులంతా ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జేసీ రాజకుమారి విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నర్మద, డీన్ శ్రీనివాస్, సివిల్ ఇన్‌చార్జ్ వెంకటేష్, కో-ఆర్డినేటర్ గోవర్ధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

గుంటూరు ఈస్ట్: బాలిక అదృశ్యంపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. తుఫాన్ నగర్‌లో నివసించే ఓ కుటుంబానికి చెందిన బాలిక శుక్రవారం ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికి, కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న తల్లిదండ్రులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్రంలో బీజేపీని ఓడించేందుకు కృషి

తాడేపల్లిరూరల్: దేశవ్యాప్తంగా బీజేపీని ఓడించడానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీ, రూరల్ కమిటీ విస్తృత సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి సీనియర్ నాయకులు ఎం.పకీరయ్య అధ్యక్షత వహించారు. రామారావు మాట్లాడుతూ బీజేపీ ప్రతిచిన్న విషయాన్ని అడ్డుపెట్టుకుని మతత్వాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. నీటి కుళాయిలకు మీటర్లు పెట్టడం, వ్యవసాయ బోరులకు మీటర్లు పెట్టడం, విద్యుత్ చార్జీలు పెంచడం ఇవన్నీ కేంద్ర ప్రభుత్వం విధానాలుగా పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈనెల 19న అమరజీవి పుచ్చలపల్లి సుందయ్య వర్ధంతిని వాడవాడలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు జె.వి.రాఘవులు, ఎస్ఎస్ చెంగయ్య, ఈమని అప్పారావు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



చేబ్రోలులో ప్రసన్నాంజనేయస్వామి



నందూరులో వీరాంజనేయస్వామి

చేబ్రోలు: హనుమత్ జయంత్యుత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని ఆంజనేయస్వామి దేవస్థానాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చారిత్రక ప్రసిద్ధి చెందిన చేబ్రోలులోని ఆదికేశవస్వామి దేవస్థాన ప్రాంగణంలోని సువర్చలా సమేత దక్షిణముఖ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో స్వామికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు.

- కొత్తరెడ్డిపాలెంలోని ప్రసన్నాంజనేయస్వామికి శనివారం లక్ష తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మ గుడి సమీపంలోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామికి వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.
- పొన్నూరు మండలం నండూరులోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో కల్యాణ వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం వివిధ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. సువర్చలా సమేత ప్రపత్తాంజనేయస్వామి 80వ జయంతి, కల్యాణ వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా సిందూరం, అప్పములతో అర్చనలు నిర్వహించారు. పంచామృత అభిషేకాలు జరిపారు.

జగన్ పాలనలో పేదలందరికీ పథకాల మంజూరు

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాల్ని అందజేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. పెదకాకాని మండలం వెనిగండ్లలో శనివారం నాలుగో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కిలారి ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేశారు. బుక్‌లెట్‌ను అందజేసి వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామ సభలో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులు సాగుతున్నాయని చెప్పారు. ఇది ప్రజలు, పేదల సంక్షేమ ప్రభుత్వమని తెలిపారు. సంక్షేమ పథకాల్ని అమలు చేయడంలో దేశంలోనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రతి సంక్షేమ పథకాన్ని వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటికి ముంగిటికే వచ్చి అందిస్తున్నామని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన కొన్ని సమస్యల్ని ఎమ్మెల్యే అక్కడక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి వేల్పుల శ్రావణి, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు మున్నంగి నాగరాణి, కె. లక్ష్మీరాజ్యం, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాన్ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా పరిగణించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాశాఖను నాన్ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా పరిగణించి, ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులను మంజూరు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘ (ఎస్టీ యూ) జిల్లా అధ్యక్షుడు గేరా మోహనరావు పేర్కొన్నారు. కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో శనివారం జరిగిన సంఘ ముఖ్య నాయకుల సమావేశంలో మోహనరావు మాట్లాడుతూ వేసవి సెలవులలో ఉపాధ్యాయులకు ఎస్సీఈఆర్టీ నిర్దేశించిన బాధ్యతలతో పాటు వి లవ్ రీడింగ్, టెన్త్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహణపై విద్యాశాఖ కమిషనర్ నుంచి డీఈవోలకు, డీఈవోల నుంచి హెచ్ఎంలకు ఎటువంటి రాతపూర్వక ఉత్తర్వులు లేవని తెలిపారు. అధికారిక ఉత్తర్వులు ఇవ్వకుండా మౌఖిక ఆదేశాలతోనే ఆయా కార్యక్రమాలకు సంబంధించి మొత్తం వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులతో పని చేయిస్తున్నారని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అవసరమైతే మిగిలిన శాఖల మాదిరిగా విద్యాశాఖను నాన్ వెకేషన్‌గా పరిగణించి ఉపాధ్యాయులచే అన్ని రకాల కార్యక్రమాలను నిర్వహించుకుని, సంపాదిత సెలవులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వేసవి సెలవుల్లో అన్ని రకాల కార్యక్రమాలకు ఉపాధ్యాయుల చేత వెట్టి చాకిరీ చేయించుకోవడం తగదని విమర్శించారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సిఫార్సు బదిలీలను వెంటనే రద్దు చేసి, రెగ్యులర్ ప్రతిపాదికన ఉపాధ్యాయ పదోన్నతుల ను కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వేసవి సెలవులు ముగిసేలోగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు.

వైభవంగా గ్రామోత్సవం



గ్రామోత్సవంలో వేషధారణలు



ఆకట్టుకున్న ఆంజనేయ వేషధారణ

నగరంపాలెం: స్థానిక నాజ్ కూడలి (కొత్తపేట)లోని శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంత్యుత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి అట్టహాసంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద మొదలై నాజ్ కూడలి, కొత్తపేట, రంగా బొమ్మ సెంటర్, కొత్తపేట శివాలయం, పాత బస్టాండ్ జిన్నా టవర్, కృష్ణ మహల్ థియేటర్ మీదుగా తిరిగి అక్కడకు చేరింది. కనక తప్పెట్లు, బాజాభజంత్రీలు, ధూప దీప నైవేద్యాలు, కోలాటం, కేరళ నాట్యం, వారాహి రూపు నాట్యం, చెక్క భజన, కర్రసాము అలరించాయి. కార్యక్రమంలో ఈవో డి.శ్రీనివాసరావు, శ్రీ హనుమాన్ సేవా సమాజ గౌరవాధ్యక్షుడు వెంకట సుబ్బారావు, అధ్యక్షుడు చేపల నాగేశ్వరరావు, కోశాధికారి అనీల్‌కుమార్, కమిటీ సభ్యులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యం

గుంటూరు రూరల్: గుర్తు తెలియని యువకుడి మృతదేహం నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం లభ్యమైంది. తురకపాలెం సమీపంలోని ఎకో పార్కు వద్ద ముళ్ల పొదల్లో 30 సంవత్సరాల వయసున్న యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకుని, పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతదేహంపై బ్లూకలర్ చొక్కా, ఫ్యాంటు ఉందని, ఆచూకీ తెలిసిన వారు నల్లపాడు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ శ్రీనివాసరావు కోరారు.

